www.prajasakti.com

ప్రజాశక్తి

గురువారం 27 మార్చి 2025

5

పశ్చిమ గోదావరి

సమస్యల పరిష్కారమే ధ్యేయంగా డిపిఆర్ సిద్ధం చేయాలి

ప్రజాశక్తి - మొగల్తూరు

మొగల్తూరు పంచాయతీలో సమస్యలు పూర్తిస్థాయిలో పరిష్కారమే ధ్యేయంగా డిపిఆర్ సిద్ధం చేయాలని మాజీ మంత్రి, రాష్ట్ర కాపు కార్పొరేషన్ ఛైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు అధికార యంత్రాంగానికి సూచించారు. మొగల్తూరులోని పంచాయతీ కార్యాలయంలో బుధవారం సాయంత్రం పలు శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో డ్రెయిన్లు, రహదారులు, తాగునీరు, విద్యుత్, పేదలకు ఇళ్లు, కాలనీల్లో రహదారుల నిర్మాణం తదితర వాటికి అవసరమైన డిపిఆర్ సిద్ధం చేయాలని ఆయన సూచించారు. ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు ఆయన గ్రామస్తుల తరపున కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో అధికారులు డిఇఇ పి.శ్రీనివాసరావు, డి.సత్యనారాయణ, ఎఇలు మోహన్‌రావు, ప్రభాకరరావు, వెంకటేశ్వరరావు, నాయకులు పడవ సత్యనారాయణ భవనం నరసింహారావు ఉన్నారు.

సిఎం సారూ.. ముంపు లెక్కలు సరిచేయరూ..!

పోలవరం నిర్వాసితుల గోడు
అరణ్య రోదనేనా
భద్రాచలం వద్ద 45 అడుగులకే
గ్రామాలు మునక
41.15 కాంటూరులో చేర్చకుండా
అన్యాయం
ప్రాజెక్టులో నీరు నింపితే చాలా గ్రామాలు
జలమయం
పరిహారమిచ్చి పంపించాలని వేడుకోలు
నేడు పోలవరంలో సిఎం పర్యటన

కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న కుక్కునూరు, వేలేరు మండలాల నిర్వాసితులు(ఫైల్ ఫొటో)

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

'పోలవరం కాంటూరు లెక్కలు అస్తవ్యస్తంగా ఉన్నాయి. చిన్నపాటి వరదకు మునుగుతున్న గ్రామాలను సైతం 45.75 కాంటూరులో చేర్చారు. ప్రతియేటా మా గ్రామాలు మునగడం.. మేమంతా కొండలు, గుట్టలు, పునరావాస కేంద్రాలకు వెళ్లడం అధికారుల సమక్షంలోనే జరుగుతోంది. అయినప్పటికీ మా గ్రామాలు తొలివిడత ముంపులో లేవని చెప్పడం ఏవిధంగా న్యాయమో మీరే చెప్పాలి' సిఎం సారూ.. ముంపు లెక్కలు సరిచేయండి.. లేకపోతే ప్రాజెక్టులో నీరు నింపితే మా బతుకులు జలసమాధి అవుతాయని పోలవరం నిర్వాసితులు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు. సిఎం చంద్రబాబు గురువారం పోలవరం ప్రాజెక్టు పరిశీలనకు వస్తుండటంతో తమ పట్టించుకోవాలని నిర్వాసితులంతా వేడుకుంటున్నారు. ప్రభుత్వం నిర్ణయించిన లెక్కల ప్రకారం 41.15 కాంటూరులో ముంపునకు గురయ్యే గ్రామాలను తొలివిడతగా ఖాళీ చేయించేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. కుక్కునూరు మండలంలో తొమ్మిది గ్రామాలు, వేలేరుపాడు మండలంలో 31 గ్రామాలు మాత్రమే ఉన్నాయి. 41.15 కాంటూరు పరిధిలో నిర్వాసితులకు పెండింగ్ ఉన్న పునరావాస ప్యాకేజీ సొమ్మును ఇటీవలే ప్రభుత్వం జమ చేసింది. ఇంకా ఇంటి స్ట్రక్చర్ వాల్యూ, భూమికి భూమి, 18 ఏళ్ల నిండిన యువతకు పరిహారం వంటి పలు సమస్యలు పెండింగ్‌లోనే ఉన్నాయి. అసలు విషయం ఏమిటంటే ప్రభుత్వం చెబుతున్న కాంటూరు లెక్కలకు, వరదలకు మునుగుతున్న గ్రామాలకు పొంతన లేకుండాపోయింది. భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 45 అడుగులకు చేరేసరికి చాలా గ్రామాలు మునిగిపోతున్నాయి. అలాంటి గ్రామాలు సైతం తొలివిడత తరలించే 41.15 కాంటూరులో చేర్చలేదు. ఆ గ్రామాలనుసైతం 45.75 కాంటూరులో చేర్చారు. ఆయా గ్రామాల నిర్వాసితులకు పరిహారం ఇవ్వడం లేదు. 2022 గోదావరి వరద పరిస్థితిని బట్టి చూస్తే కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లోని గ్రామాలన్నీ ముంపునకు గురయ్యాయి. ఇక్క పైభాగం నుంచి వరద నీరు పారింది. ఇదంతా కళ్ల ముందే జరిగినా అధికారులు కాంటూరు లెక్కల పేరుతో మసిపూసి మారేడు కాయ చేస్తున్నారని నిర్వాసితులు తీవ్ర వేదనకు గురవుతున్నారు. తమకు న్యాయం చేయాలని రెండు రోజుల క్రితం కుక్కునూరు, వేలేరుపాడు మండలాలకు చెందిన మద్దిపాడు, ఆంబోతులగూడెం, యల్లప్పగూడెం, కొత్తూరు, మాధవరం, సుద్దగంప, వసంతవాడతోపాటు దాదాపు పది గ్రామాలకు చెందిన నిర్వాసితులు ఏలూరు కలెక్టరేట్ వద్ద ఆందోళన చేసి ఉన్నతాధికారులకు వినతులు అందించారు. గ్రామాలు ముంపునకు గురవుతున్నా అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరించడం ఏమిటనే ప్రశ్న అందరినీ తొలిచేస్తోంది.

ప్రాజెక్టులో నీళ్లు నింపితే అక్కడి ప్రజల పరిస్థితి ఏమిటి?

వచ్చే ఏడాది నాటికి 41.15 అడుగుల ఎత్తుకు ప్రాజెక్టు పూర్తి చేసి నీళ్లు నింపి సాగుకు నీరందిస్తామని ప్రభుత్వం చెబుతోంది. 41.15 కాంటూరు పరిధిలో గ్రామాలను మాత్రమే ఖాళీ చేయించి ప్రాజెక్టులో నీళ్లు నింపితే ముంపు బారిన పడుతున్న మిగిలిన గ్రామాల ప్రజల పరిస్థితి ఏమిటో ప్రభుత్వం చెప్పాలి. వాళ్లంతా ఎక్కడకు వెళ్లాలనే ప్రశ్న అందరినీ తొలిచేస్తోంది. అదే సమయంలో చుట్టూ నీళ్లు వచ్చేసిన తర్వాత ముంపులో లేవని చెబుతున్న గ్రామాల ప్రజలు ఏవిధంగా జీవనం సాగించాలి. సాగు చేసేందుకు భూములుండవు. ఉపాధి దొరకదు. అక్కడ నిర్వాసితులు ఏ విధంగా బతకాలో పాలకులకు అర్థమవుతుందో, లేదో కూడా తెలియని పరిస్థితి ఉంది. మండలం యూనిట్‌గా తీసుకుని పరిహారం చెల్లిస్తే తప్ప నిర్వాసితులకు న్యాయం జరిగే పరిస్థితి కన్పించడం లేదు. అశాస్త్రీయంగా చేసిన కాంటూరు లెక్కలనే ఆధారంగా చేసుకుని ప్రభుత్వం ముందుకు సాగడం అత్యంత దారుణమని చెప్పొచ్చు. ఇప్పటికైనా ముంపు గ్రామాలకు సంబంధించి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి చర్యలు తీసుకోవాల్సి ఉంది. లేకపోతే నిర్వాసితుల బతుకులు జలమయమవుతాయనడంలో ఎటువంటి సందేహమూ అక్కర్లేదు.

ఎరువుగా గుర్రపు డెక్క ఆకు

ప్రాసెసింగ్ పరిశ్రమలకు ప్రోత్సాహం

612 హెక్టార్లలో కొత్తగా ఉద్యాన పంటల సాగు

విజయవాడ సదస్సులో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి

కలెక్టర్ల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

సాగునీటి కాలువల్లో విస్తారంగా పెరిగే గుర్రపు డెక్క ఆకును ఎరువుగా మార్చి సద్వినియోగం చేసుకునే దిశగా కృషి చేస్తున్నామని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన విజయవాడలో రెండు రోజుల నుంచి జరుగుతున్న కలెక్టర్ల సదస్సులో జిల్లా కలెక్టర్ నాగరాణి జిల్లా ప్రగతిని వివరించారు. జిల్లాలో సాగునీటి కాలువల్లో గుర్రపుడెక్క ఆకు విపరీతంగా పెరుగుతోందని, ఇది సాగునీటి ప్రవాహానికి కూడా ఇబ్బందికరంగా ఉంటుందని, అయితే ఈ గుర్రపు డెక్క ఆకును ఎరువుగా మార్చి, దాన్ని సద్వినియోగం చేసుకోవడం ద్వారా అటు గుర్రపు డెక్క ఆకు సమస్యను పరిష్కరించుకునే అవకాశాలపై కూడా తాము పనిచేస్తున్నామని వివరించారు. రాబోయే ఆర్థిక సంవత్సరంలో జిల్లాలో తలసరి ఆదాయం రూ.3.50 లక్షలు సాధించాలన్నది తమ లక్ష్యమన్నారు. జిల్లాలో ఆక్వా రంగంలో గణనీయమైన ప్రగతి సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ప్రస్తుతం జిల్లాలో చేపలు, రొయ్యల సాగు 1.33 లక్షల ఎకరాల నుంచి 1.50 లక్షల ఎకరాలకు పెంచే దిశగా పనిచేస్తున్నామన్నారు. జిల్లాలో పశువైద్యశాలల భవనాలు చాలా వరకూ శిథిలావస్థలో ఉన్నాయని వాటికి వెంటనే మరమ్మతులు చేయడం, కొత్తవి నిర్మించడానికి సహకారం అందించాలని కోరారు.

అధికారులకు సూచనలిస్తున్న మంత్రి నిమ్మల రామానాయుడు

2027 డిసెంబర్‌కు ప్రాజెక్టు పనులు పూర్తి

సిఎం పర్యటనా ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి నిమ్మల రామానాయుడు

ప్రజాశక్తి - పోలవరం

2027 డిసెంబర్ నాటికి పోలవరం ప్రాజెక్టు పనులను పూర్తి చేసేలా డిజైన్లకు అనుమతుల కోసం కృషి చేస్తున్నామని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. సిఎం పోలవరం ప్రాజెక్టు పనుల పరిశీలనకు గురువారం రానున్న నేపథ్యంలో పర్యటనా ఏర్పాట్లను మంత్రి నిమ్మల బుధవారం రాత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ జగన్ నిర్వాకం వల్ల కొత్తగా రూ.990 కోట్లతో డయాఫ్రమ్ వాల్ నిర్మించాల్సి వస్తుందన్నారు. అంతర్జాతీయ నిపుణుల కమిటీ, సిడబ్ల్యూసి, పిపిఎలను ఎప్పటికప్పుడు సమన్వయపర్చుకుంటూ 2027 డిసెంబర్‌కు ప్రాజెక్ట్ నిర్మాణ పనులు పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. మంత్రి వెంట పలువురు ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు ఉన్నారు.

శెట్టిబలిజపేట స్కూల్ విలీనాన్ని ఆపండి

ఎంపిపి దుర్గాభవానీకి స్థానికుల వినతి

ఎంపిపి దుర్గాభవానికి వినతిపత్రం అందజేస్తున్న స్థానికులు

ప్రజాశక్తి - వీరవాసరం

వీరవాసరం గ్రామంలో శెట్టిబలిజపేటలోని ప్రాథమిక పాఠశాలను కిలోమీటరు దూరంలో ఉన్న మరో పాఠశాలలో (మెయిన్‌స్కూల్) విలీనం చేయడాన్ని స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు పాఠశాల విలీనం వల్ల కలిగే ఇబ్బందులను స్థానికులు బుధవారం ఎంపిపి వీరవల్లి దుర్గాభవాని చంద్రశేఖర్ దృష్టికి తీసుకొచ్చి వినతిపత్రం అందజేశారు. ఈ పాఠశాల విలీనం వల్ల విద్యార్థులు అంత దూరం వెళ్లాలంటే సంత వద్ద కుక్కల బెడద ఉంటుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మత్స్యపురి-వీరవాసరం ఆర్‌అండ్‌బి మార్గంలో ఏనుగు గుడి వద్ద నాలుగు రోడ్ల కూడలి వల్ల విద్యార్థులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికే ఈ ప్రాంతంలో అనేక ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని తెలిపారు. 32 మంది విద్యార్థులతో ఈ పాఠశాల నడుస్తోందన్నారు. అదేవిధంగా 25 మంది పిల్లలతో అంగన్‌వాడీ కేంద్రం కూడా ఇదే పాఠశాలలో కొనసాగుతోందన్నారు. 57 మంది విద్యార్థులున్న ఈ పాఠశాలను రాకపోకలు ఇబ్బంది కలిగే మరో పాఠశాలలో విలీనం చేయడాన్ని స్థానికులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఈ పాఠశాలకు సమీపంలో ఎల్లమ్మ చెరువు వద్ద ఉన్న పాఠశాలను శెట్టిబలిజ పేటలోని పాఠశాలలో విలీనం చేస్తే స్థానికులు చెబుతున్న ఇబ్బందులు అధిగమించే అవకాశం ఉంటుందని అంటున్నారు. అనంతరం ఎంపిపి మాట్లాడుతూ స్థానికులు చెబుతున్న అభ్యంతరాలు పరిగణలోకి తీసుకుంటామన్నారు. విద్యార్థుల సంఖ్యకు తగ్గట్టుగా శెట్టిబలిజపేటలోని పాఠశాల వద్ద అదనపు తరగతుల భవనాలను మండల పరిషత్ నిధులతో నిర్మాణం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి వీరవల్లి కనక ఉషారాణి, వార్డు సభ్యుడు గుత్తుల కృష్ణ, రాయపల్లి వెంకట్, వీరవల్లి రాధాకృష్ణ, విద్యార్థులు, తల్లితండ్రులు పాల్గొన్నారు.

పోక్సోపై అవగాహనుండాలి

సీనియర్ సివిల్ జడ్జి జి.గంగరాజు

:మాట్లాడుతున్న న్యాయమూర్తి గంగరాజు

ప్రజాశక్తి - నరసాపురం

ప్రతి విద్యార్థీ లైంగిక వేధింపుల నుంచి పిల్లలను రక్షించే చట్టం (పోక్సో)పై అవగాహన కలిగి ఉండాలని నరసాపురం సీనియర్ సివిల్ జడ్జి జి.గంగరాజు అన్నారు. పట్టణంలోని రాయపేటలో మిషన్ హైస్కూల్ వద్ద జరిగిన పోక్సో చట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఉన్నత న్యాయ స్థానాల ఆదేశాల మేరకు మండల న్యాయ సేవాధికార సంస్థ నరసాపురం వారి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి స్కూల్ ప్రిన్సిపల్ నీరజ అధ్యక్షత వహించగా న్యాయమూర్తి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. 20 సంవత్సరాలు కష్టపడి చదివితే మిగిలిన 60 సంవత్సరాలు సుఖంగా జీవించొచ్చన్నారు. స్కూల్‌కు వెళ్లి వచ్చే సమయంలో అపరిచితులతో పరిచయాలు పెంచుకోకూడదని తెలిపారు. మానసికంగా, శారీరకంగా ఎవరైనా ఇబ్బంది కలిగిస్తే తల్లిదండ్రులకు గానీ, ఉపాధ్యాయులకు గానీ చెప్పాలని, లేకుంటే 1090 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేయాలని తెలిపారు. గుడ్, బ్యాడ్ టచ్, బాలల హక్కులు, బాల్య వివాహాలపై కనీస అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో పట్టణ సిఐ బి.యాదగిరి, ఐసిడిఎస్ సిడిపిఒ ఊర్మిళ, ఎస్ఐ సిహెచ్ జయలక్ష్మి,ప్యానెల్ లాయర్ శిరీష, కోర్టు లైజనింగ్ అధికారి భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

ఫ్యాప్టో ఛైర్మన్‌గా విజయరామరాజు

యుటిఎఫ్, ఉపాధ్యాయ సంఘాల అభినందన



విజయరామరాజు

ప్రజాశక్తి - భీమవరం

ఫ్యాప్టో పశ్చిమగోదావరి జిల్లా ఛైర్మన్‌గా యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు పిఎస్.విజయరామరాజు ఎన్నికయ్యారు. అలాగే జనరల్ కార్యదర్శిగా జి.ప్రకాశం (డిటిఎఫ్ 257), డిప్యూటీ సెక్రటరీ జనరల్స్‌గా ఎకెవి.రామభద్రం (యుటిఎఫ్), గుత్తుల శ్రీనివాస్ (ఎస్‌టియు), వివిఎన్ఎన్‌బి.రమణారావు (ఎపిటిఎఫ్ 1938), కో ఛైర్మన్లుగా పిఆర్‌విఎస్.సాయివర్మ (ఎస్‌టియు), ఎన్.శ్రీనివాసరావు (డిటిఎఫ్), బిఎన్.నారాయణ (ఎపిటిఎఫ్), కె.వెంకటేశ్వరరావు (బిటిఎ), కోశాధికారిగా సిహెచ్ పట్టాభి రామయ్య (యుటిఎఫ్), సెక్రటరీలుగా ఎం.హరికృష్ణ (ఎపిటిఎఫ్ 1938), జి.మధుసూదన్ రావు (బిటిఎ), ఆర్.యరకేశ్వరరావు (డిటిఎఫ్) ఎన్నికయ్యారు. ఫ్యాప్టో ఛైర్మన్‌గా ఎన్నికైన విజయరామరాజు ప్రస్తుతం యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులుగా పనిచేస్తున్నారు. ఉపాధ్యాయ ఉద్యమంతో పాటు సామాజిక ఉద్యమంలో సైతం విజయరామరాజు చురుకైన పాత్ర పోషిస్తున్నారు. ఛైర్మన్‌గా విజయరామరాజు ఎన్నిక కావడం పట్ల అటు యుటిఎఫ్‌తో పాటు ఉపాధ్యాయ సంఘాలు అభినందనలు తెలిపాయి. స్థానిక ఎఆర్‌కెఆర్‌లో నిర్వహించిన సమావేశంలో ఈ ఎన్నిక జరిగింది. రాష్ట్ర ఫ్యాప్టో ఛైర్మన్ ఎల్.సాయి శ్రీనివాస్ ఎన్నికకు హాజరై మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన బకాయిలు కొంతమేరకు చెల్లించినా పూర్తి బకాయిలకు ఒక రోడ్డు మ్యాప్ ఇవ్వాలన్నారు. అలాగే బకాయి పడ్డ డిఎలను విడుదల చేయాలని, పిఆర్‌సి కమిషనర్‌ను నియమించాలని, వెంటనే ఐఆర్ కూడా ఇవ్వాలని డిమాండ్ చేశారు. నూతనంగా ఎన్నికైన ఫ్యాప్టో ఛైర్మన్ విజయరామరాజు, సెక్రటరీ జనరల్ జి.ప్రకాశం మాట్లాడుతూ ఫ్యాప్టో రాష్ట్ర కమిటీ ఇచ్చిన ప్రతి కార్యక్రమాన్నీ జిల్లా స్థాయిలో విజయవంతం చేస్తామన్నారు. అలాగే తమ ఎన్నికకు సహకరించిన ఆయా ఉపాధ్యాయ సంఘాలకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

కోమటితిప్ప నార్త్‌లో సీసీ రోడ్డుకు ఎంఎల్ఎ శంకుస్థాపన

రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న ఎంఎల్ఎ అంజిబాబు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పాలన అందిస్తోందని ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. బుధవారం మండలంలోని కోమటితిప్ప నార్త్ గ్రామంలో సుమారు రూ.40 లక్షలతో వెంకటతిప్ప హాబీటేషన్‌లోని పిఆర్ రోడ్డు నుంచి కె.ఆంజనేయులు ఇంటి వరకూ (వయా) ఎంపిఇఎస్ స్కూల్ వరకూ సీసీ రోడ్డుకు ఎంఎల్ఎ అంజిబాబు, రాజ్యసభ మాజీ సభ్యురాలు సీతారామలక్ష్మి శంకుస్థాపన చేశారు. కూటమి ప్రభుత్వం రవాణా, మౌలిక సదుపాయాల కోసం అధిక ప్రాధాన్యతిస్తోందని, అన్ని గ్రామాల్లో మౌలిక వసతులు ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం అన్ని విధాలుగా కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, మహిళలు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

తాగునీటి ఇబ్బందుల్లేకుండా చర్యలు

ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్

మాట్లాడుతున్న ఎంఎల్ఎ నాయకర్

ప్రజాశక్తి - నరసాపురం

వేసవిలో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్ అన్నారు. బుధవారం స్థానిక జనసేన కార్యాలయంలో నాయకర్ ఇరిగేషన్, ఆర్‌డబ్ల్యుఎస్, డ్రెయిన్స్, నీటి సంఘాల అధ్యక్షులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకర్ మాట్లాడుతూ ప్రస్తుతం దాళ్వా సీజన్ నేపథ్యంలో రైతులకు సాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ ప్రభు కుమార్

మాట్లాడుతున్న ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ ప్రభుకుమార్

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండి, ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించి, దేశ ప్రగతికి పాటుపడాలని ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ కెవిఎన్.ప్రభుకుమార్ (ఏలూరు) సూచించారు. మత్తు పదార్థాల వినియోగం అంశంపై గ్రీన్ వ్యాలీ ఫౌండేషన్ (విశాఖపట్నం), స్థానిక దీక్ష మత్తు ముందు బానిసల పునరావాస కేంద్రం వద్ద బుధవారం నిర్వహించిన మాస్టర్ ట్రెయినర్స్ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రీన్ వ్యాలీ ఫౌండేషన్ ట్రెయినర్ ఉమా రాజు మాట్లాడుతూ మత్తు పదార్థాలకు బానిసైన వారిని గుర్తించి పునరావాస కేంద్రాల్లో చేర్పించి వారిని మత్తు పదార్థాల నుంచి విముక్తులను చేయాలని కోరారు. దేవి ఎడ్యుకేషనల్ సొసైటీ, దీక్ష మత్తు ముందు బానిసల పునరావాస కేంద్ర నిర్వాహకురాలు దుర్గ మాట్లాడుతూ తమ సంస్థలో మత్తు పదార్థాలకు బానిసైన వారికి భోజన వసతితో పాటు ఉచిత వైద్యం అందించి వారిని తిరిగి ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ఎవరైనా మత్తుకు బానిసలైతే అయినటువంటి వారిని తమ వద్దకు తీసుకొచ్చి చేర్పించవచ్చని తెలిపారు. అనంతరం కేంద్రంలో చికిత్స తీసుకుంటున్న వారికి అసిస్టెంట్ కమిషనర్ ప్రభుకుమార్ పండ్లు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఇ.స్వరాజ్యలక్ష్మి, ఎస్ఐలు మురళీ మోహన్‌రావు, దొరబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

గర్భిణులకు మెరుగైన వైద్య సేవలందించాలి

వైద్యాధికారులతో సమీక్షిస్తున్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని గీతాబాయ్

ప్రజాశక్తి - తణుకు రూరల్

గర్భిణులను త్వరతగతిన గుర్తించి అంగన్వాడీ కేంద్రాలతో సమన్వయం చేసుకుని వారికి పోషణ, మెరుగైన వైద్య సేవలు అందేలా చూడాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి గీతా బాయ్ సూచించారు. మండలంలోని వేల్పూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. పిహెచ్‌సి ద్వారా అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు. గర్భిణీలకు మరింత సమర్థవంతమైన ప్రసూతి సేవలు అందించాలన్నారు. వైద్య సేవల విషయంలో లబ్ధిదారులకు ఆర్థిక భారం కాకుండా ఎన్‌టిఆర్ వైద్య సేవ ద్వారా మాతా శిశు సంరక్షణ సేవలు అందించాలన్నారు. గర్భిణుల్లో రక్తహీనత లేకుండా ఎప్పటికప్పుడు పరీక్షలు నిర్వహించాలన్నారు.

ఇంటర్ స్పాట్ సెంటర్‌ను సందర్శించిన ఎంఎల్‌సి

ఎంఎల్‌సికి వినతిపత్రం అందజేస్తున్న అధ్యాపకులు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

స్థానిక కోటదిబ్బలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహిస్తున్న ఇంటర్మీడియట్ మూల్యాంకన కేంద్రాన్ని బుధవారం ఉపాధ్యాయ ఎంఎల్‌సి బి.గోపీమూర్తి సందర్శించారు. ఈ సందర్భంగా పలువురు అధ్యాపకులు వారి సమస్యలను ఎంఎల్‌సి దృష్టికి తీసుకెళ్లి వినతిపత్రం అందజేశారు. జూనియర్ లెక్చరర్లకు ప్రిన్సిపల్ ప్రమోషన్స్‌లో జరిగిన అన్యాయం సరిచేయాలని, కాంట్రాక్టు జూనియర్ లెక్చరర్లను రెగ్యులర్ చేసే ప్రక్రియ, ప్రయివేట్ కళాశాలలు, పాఠశాలల్లో పని చేస్తున్న వారికీ హెల్త్ కార్డుల మంజూరు, జిపిఎస్ స్థానంలో ఒపిఎస్ సాధన గురించి అధ్యాపకులు ఎంఎల్‌సితో చర్చించారు. అలాగే తెలుగును ఆప్షనల్‌గా కాక కచ్చితంగా అందరికీ తెలుగు సబ్జెక్టు ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై స్పందించిన ఎంఎల్‌సి గోపీమూర్తి ఈ విషయాలను శాసన మండలిలో ప్రస్తావిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఏలూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బివి.శ్రీనివాస్, పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కీర్తి కిరణ్

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ

ప్రజాశక్తి - కాళ్ల

కాళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయం భీమవరం నుంచి ఎన్‌టిఆర్ వైద్య సేవ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ కీర్తి కిరణ్ బుధవారం తనిఖీ నిర్వహించారు. కాళ్ల ప్రాథమిక ఆరోగ్యం కేంద్రంను సందర్శించి పిఎంజెఎవై కార్డులు పంపిణీ గురించి సమీక్షించారు. ఎంఎల్‌హెచ్‌పిలకు తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఎన్‌టిఆర్ వైద్య సేవ ఏ హాస్పిటల్లో ఏ సేవలు అందుతున్నాయో ఎఫ్‌పిసి క్యాంపులో ప్రదర్శించమని సూచించారు. హాస్పిటల్‌లోని రికార్డులను పరిశీలించారు. రోగులకు అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. ప్రజారోగ్య పథకాల అమలుతీరును ఆమె సమీక్షించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ సరాబు సునీల్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబ సభ్యులకు పరామర్శ

ప్రజాశక్తి - పెనుమంట్ర

మండలంలోని మార్టేరు వివేకానంద ఇంగ్లీష్ స్కూల్ టీచర్ చిర్ల సుజాత(స్థానిక వేణుగోపాల జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు చిర్ల చిన సూర్యనారాయణ రెడ్డి భార్య) ఇటీవల నెగ్గిపూడిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆకస్మిక మృతిచెందిన విషయం విధితమే. బుధవారం వారి కుటుంబ సభ్యులకు మానవతా సంస్థ సభ్యులు సంతాపం ప్రకటించారు. మానవత ఆత్మీయ సహకార కమిటీ ఛైర్మన్ చిర్ల శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన జరిగిన సంతాప సభలో వారు మాట్లాడుతూ ప్రయివేటు పాఠశాలలో ఉపాధ్యాయునిగా పనిచేస్తూ ఎంతో మందికి విద్యాబుద్ధులు నేర్పుతూ, భోజన విరామ సమయంలో ఇంటికి వస్తూ వాహన ప్రమాదంలో చిర్ల సుజాత ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక మండల అధ్యక్షులు కర్రి కృష్ణారెడ్డి, కోశాధికారి చదువుల నరేంద్ర, జిల్లా కన్వీనర్ కొత్త సత్యనారాయణ మూర్తి, రీజినల్ ఛైర్మన్ బాణాల శ్రీనివాసరావు, వైస్ ప్రెసిడెంట్ బండి ప్రసాద్, డైరెక్టర్స్ పడాల జగన్నాథ రెడ్డి, చిర్ల నర్సిరెడ్డి, కోణాల నరసింహ రెడ్డి పాల్గొన్నారు.

కాళ్లకూరులో పోలేరమ్మ జాతర

కాళ్ల : కాళ్లకూరు గ్రామంలో పోలేరమ్మ జాతర మహోత్సవం అంగరంగ వైభవంగా బుధవారం నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, జలాభిషేకం చేశారు. కార్యక్రమలో ఎపిఐఐసి ఛైర్మన్ మంతెన రామరాజు, పెన్మెత్స సోమరాజు, పివి.రామరాజు, గోకరాజు మురళీరాజు, అడ్డాల నాగరాజు, డాక్టర్ దాట్ల వెంకట రామరాజు, వేగేశ్న విజయ రామరాజు, శంకర్ రాజు, గాదిరాజు నాగరాజు, పెన్మెత్స చంద్రశేఖర్‌రాజు, పెన్మెత్స సత్తిబాబు పాల్గొన్నారు.

నేడు పన్నుల వసూళ్లకు బహిరంగ వేలంపాట

నరసాపురం : నరసాపురం మున్సిపాలిటీ మార్కెట్లో రోజువారీ పన్నులు వసూళ్లు చేసుకునేందుకు గురువారం బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య తెలిపారు. ఈమేరకు బుధవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి హక్కులు కల్పించేందుకు ఉదయం 11 గంటలకు బహిరంగవేలం నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈనెల 25న నిర్వహించిన వేలంపాటలో ఎవరూ పాల్గొనకపోవడంతో 29న వాయిదా వేసినట్లు కమిషనర్ ప్రకటించారు. అనివార్య కారణాల రీత్యా తిరిగి 27వ తేదీ గురువారం వేలంపాట నిర్వహిస్తున్నట్లు కమిషనర్ తెలిపారు.

ఇద్దరు వార్డు సభ్యులు టిడిపిలో చేరిక

తణుకు రూరల్, అత్తిలి : అత్తిలి మండలం కె.సముద్రపుగట్టు గ్రామానికి చెందిన ఇద్దరు వార్డు సభ్యులు బుధవారం టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. గ్రామానికి చెందిన ఒకటో వార్డు సభ్యులు మల్లుల వరలక్ష్మి, పదో వార్డు సభ్యులు వీరమళ్ల నాగవేణిలు తణుకు ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ సమక్షంలో పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. వీరికి పార్టీ కండువా కప్పి ఎంఎల్ఎ సాదరంగా ఆహ్వానించారు. గత ప్రభుత్వ విధానాలతో విసిగిపోయి ఎంఎల్ఎ రాధాకృష్ణ చేస్తున్న అభివృద్ధికి ఆకర్షితులై టిడిపిలో చేరుతున్నట్లు వారు వెల్లడించారు.

త్రిబుల్ ఎఫ్ ట్రస్ట్ ద్వారా పలు సేవా కార్యక్రమాలు

తాడేపల్లిగూడెం : త్రిబుల్ ఎఫ్ ఇండస్ట్రీస్ వారి రామేశ్వర్ బాలకృష్ణ గోయంకా ట్రస్ట్ ద్వారా కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద వివిధ రకాల సేవా కార్యక్రమాలను తాడేపల్లిగూడెం, పరిసర ప్రాంతాలలో చేపట్టినట్లు త్రీఎఫ్ ఇండస్ట్రీస్ మేనేజింగ్ డైరెక్టర్ ఓం ప్రకాష్ గోయంకా బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఇందులో భాగంగా ప్రత్తిపాడు గ్రామంలో సుమారు రూ.7 లక్షలతో ఆర్‌ఒ ప్లాంట్‌ను, జువ్వలపాలెం గ్రామంలో హిందూ శ్మశానవాటికను సుమారు రూ.13 లక్షలతో అభివృద్ధి చేసినట్లు తెలిపారు. అదేవిధంగా స్థానిక జెడ్‌పి హైస్కూల్ ప్రాంగణంలోని గవర్నమెంట్ జూనియర్ కళాశాల విద్యార్థినులకు సుమారు రూ.10 లక్షలతో టాయిలెట్స్ నిర్మిస్తున్నట్లు తెలిపారు.

ఏక మొత్తంలో పన్ను చెల్లిస్తే 50 శాతం వడ్డీ మాఫీ

మున్సిపల్ కమిషనర్ టి.రామ్‌కుమార్

తణుకు : ఆస్తిపన్ను, ఖాళీ స్థలం పన్నుల బకాయిలను ఏక మొత్తంలో చెల్లించిన వారికి 50 శాతం వడ్డీ మాఫీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం జిఒఎంఎస్ నెం.46 విడుదల చేసిందని తణుకు మున్సిపల్ కమిషనర్ టి.రామ్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ సందర్భంగా రామ్‌కుమార్ మాట్లాడుతూ ఆస్తిపన్ను, ఖాళీ స్థలం పన్నుల విషయంలో ఈ ఆర్థిక సంవత్సరం వరకూ ఉన్న బకాయిలను, ఈ ఆర్థిక సంవత్సరం బకాయిపై విధించిన వడ్డీను ఏకమొత్తం(ఒన్ టైమ్)గా మాఫీ చేయడం జరిగిందన్నారు. పన్ను చెల్లించవలసిన చెల్లింపుదారులు బకాయి ఉన్న మొత్తాన్నీ ఒకేసారి ఈనెల 31వ తేదీలోగా చెల్లించుటకు మాత్రమే 50 శాతం వడ్డీ మినహాయింపు వర్తిస్తుందన్నారు. తణుకు పురపాలక సంఘ పరిధిలో పన్ను చెల్లింపుదారులు అందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకొని వడ్డీ రాయితీని పొందవలసిందిగా కోరారు. దీనికి పురపాలక సంఘ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. సెలవు దినాల్లో కూడా పన్నులు స్వీకరించుటకు కౌంటర్లు పనిచేస్తాయని, పన్ను చెల్లింపుదారులు పన్నులను పురపాలక సంఘ కార్యాలయ కౌంటర్లలో గాని, వార్డు సచివాలయంలో, ఆన్ లైన్ ద్వారా https://cdma.ap.gov.in చెల్లించవచ్చునని తెలియజేశారు.

మావుళ్లమ్మ హుండీ ఆదాయం రూ.21,06,063

ప్రజాశక్తి - భీమవరం టౌన్

పట్టణంలో వేంచేసియున్న మావుళ్లమ్మ అమ్మవారి హుండీ బుధవారం తెరచి లెక్కించగా ఆదాయం రూ.21,06,063 వచ్చినట్లు ఆలయ సహాయ కమిషనర్ ఇఒ బుద్ధ మహాలక్ష్మి నగేష్ తెలిపారు. ఈ లెక్కింపులో ఆలయ ప్రధానార్చకులు బ్రహ్మశ్రీ మద్దిరాల మల్లికార్జున శర్మ, తనిఖీదారి వి.వెంకటేశ్వరరావు, ఇఒ దండు కృష్ణంరాజు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పేదల సొంతింటి కల నెరవేర్చాలి : సిపిఐ

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ప్రతీ పేద కుటుంబానికి పట్టణాల్లో 2 సెంట్లు, గ్రామాల్లో 3 సెంట్లు ఇంటి స్థలం, ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు కేటాయించి పేదల సొంతింటి కల నెరవేర్చాలని సిపిఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు కోరారు. బుధవారం సిపిఐ, ఎపి మహిళా సమాఖ్య తాడేపల్లిగూడెం పట్టణ శాఖల ఆధ్వర్యంలో తాడేపల్లిగూడెం 3వ వార్డు కనకదుర్గమ్మ ఆలయం వద్ద ఇళ్లస్థలాల అర్జీలు పూర్తిచేశారు. తక్షణమే పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చి ఆదుకోవాలని భీమారావు కోరారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం.సీతారాం ప్రసాద్, తాడేపల్లిగూడెం పట్టణ కార్యదర్శి నాగేశ్వరావు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలికి గాయాలు

ప్రజాశక్తి - ఉండి

165వ జాతీయ రహదారిలోని ఉండి గ్రామంలో బుధవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల సమాచారం ప్రకారం ఉండి గ్రామానికి చెందిన రౌతు పెద్దింట్లమ్మ అనే వృద్ధురాలు స్థానికంగా ఉన్న ఒక భోజనం హోటల్ వద్ద కొబ్బరి ఈనెలు తీస్తుండగా ఆకివీడు నుంచి వస్తున్న కారుకు బ్రేకులు ఫెయిల్ అవ్వడంతో డ్రైవర్ అప్రమత్తమై హోటల్ బయట ఉన్న ఫ్రైడ్ రైస్ బండిని ఢీకొని పక్కనే ఉన్న వద్ధురాలిని ఢీకొనడంతో ఆమె కాలికి తీవ్ర గాయాలు అయ్యాయి. వెంటనే స్థానికుల సహకారంతో ఆసుపత్రికి తరలించారు. దీనిపై పోలీస్ స్టేషన్లో కేసు నమోదు కాలేదని పోలీసులు తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

రెండు నెలల్లో రీసర్వే పూర్తి చేయడమే లక్ష్యం

డిప్యూటీ తహశీల్దార్ కె.సూర్యనారాయణ రాజు

చిట్-చాట్

ప్రజాశక్తి - పాలకోడేరు

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొని రీసర్వే చేస్తుందని, మండలంలో రీ సర్వే శరవేగంగా జరుగుతుందని, రెండు నెలల్లో రీసర్వేను పూర్తి చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు పాలకోడేరు రీసర్వే డిప్యూటీ తహశీల్దార్ కె.సూర్యనారాయణ రాజు తెలిపారు. రీసర్వేపై చాలామందికి అపోహలు ఉన్నాయని, కానీ అవన్నీ అవాస్తవమన్నారు. రీసర్వే వల్ల అనేక ఉపయోగాలు ఉన్నాయని తెలిపారు. మండలంలో రీ సర్వే వేగంగా జరుగుతుందని, రైతు నుంచి కూడా సహకారం పూర్తిస్థాయిలో లభిస్తుందని తెలిపారు. పాలకోడేరు తహశీల్దార్ ఎన్‌బి .విజయలక్ష్మి రీ సర్వేపై ప్రత్యేక దృష్టి సారించారన్నారు. మండలంలో జరుగుతున్న రీ సర్వే పనులపై ప్రజాశక్తితో ఆయన ముచ్చటించారు.

ప్రశ్న : మండలంలో గ్రామాలు, పంచాయతీలు, సచివాలయాలు ఎన్ని ఉన్నాయి?

డిటి : పాలకోడేరు మండలంలో 14 గ్రామాలు ఉన్నాయి. వీటిలో 14 గ్రామపంచాయతీలు, 18 సచివాలయాలు ఉన్నాయి.

ప్రశ్న : మండలంలో ప్రభుత్వ, ప్రయివేటుతో పాటు ఇతర భూములు ఎన్ని ఎకరాలు ఉన్నాయి?

డిటి : మండలంలో 22,821.64 ఎకరాల భూ విస్తీర్ణం ఉంది. దీనిలో ప్రభుత్వ భూమి 3121.09 ఎకరాలు, ప్రయివేటు భూమి 19,699 ఎకరాలు, ఇళ్ల సముదాయాలకు సంబంధించిన భూమి 833 ఎకరాలు ఉన్నాయి. అలాగే వక్ఫుర్డ్ భూములు, దేవాదాయ ధర్మాదాయ శాఖకు సంబంధించిన భూములు కూడా ఉన్నాయి.

ప్రశ్న : ఎన్ని గ్రామాల్లో రీసర్వే పూర్తయింది?

డిటి : గొరగనముడి, పెన్నాడ, విస్సాకోడేరు, పాలకోడేరు, గొల్లలకోడేరు, గరగపర్రు, మొగల్లు, కోరుకొల్లు, మైప, వేంద్ర, వేంద్ర అగ్రహారం, కొండేపూడి గ్రామాల్లో రీ సర్వే పూర్తి అయింది.

ప్రశ్న : ప్రస్తుతం ఏ గ్రామంలో రీ సర్వే జరుగుతుంది?

డిటి : శృంగవృక్షంలో రీ సర్వే జరుగుతుంది. ఈ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. గతంలో రీ సర్వే చేసేందుకు సమయం తక్కువ ఉండేది. కానీ ప్రస్తుతం సమయం ఎక్కువ తీసుకుని సమగ్రంగా చేసే విధంగా చర్యలు చేపట్టడం జరిగింది.

ప్రశ్న : ఈ గ్రామంలో ఎన్ని ఖాతా నెంబర్లలో ఎంత విస్తీర్ణం భూమి ఉంది? ఎన్ని రకాల భూములు ఉన్నాయి?

డిటి : సుమారు 3 వేలు ఖాతా నెంబర్లు ఉన్నాయి. ఈ నెంబర్ల పరిధిలో 3,871.02 ఎకరాల భూమి ఉంది. ప్రభుత్వ భూమి 381 ఎకరాలు, ఎండోమెంట్ భూమి 35.68 ఎకరాలు, వక్ఫుర్డ్ భూములు 10.10 ఎకరాలు ఉన్నాయి. మిగిలిన భూమి ప్రయివేట్ భూమిగా ఉంది.

ప్రశ్న : ఈ గ్రామంలో రీసర్వే ఎలా జరుగుతుంది?

డిటి : ఈ గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టు గ్రామంగా తీసుకోవడం జరిగింది. గ్రామంలో విస్తీర్ణం అంతటిని 2,985 సబ్ డివిజన్లుగా చేయడం జరిగింది. ఏడు టీములను ఏర్పాటు చేశాం. ప్రతి 500 ఎకరాలకు ఒక టీం ఏర్పాటు చేసాం. ఒక్కో టీంలో ఇద్దరు సర్వేయర్లు, ఒక విఆర్‌ఒ, ఒక విలేజ్ అసిస్టెంట్‌ను నియమించడం జరిగింది. అలాగే ఇద్దరు విఆర్‌ఒలు, మరో ఇద్దరు సర్వేయర్‌లతో కమ్యూనికేషన్ టీంను కూడా ఏర్పాటు చేశాము. ఇప్పటికే రైతులందరికీ నోటీసులు అందించాం. గ్రాండ్ టూ థింగ్ పనులు జరుగుతున్నాయి. ఒక ప్రాంతానికి ఒక ఎల్‌పిఎం నెంబర్లు ఇచ్చే విధంగా చర్యలు చేపట్టాం.

ప్రశ్న : రీసర్వేపై అనేక అపోహలు ఉన్నాయి. వీటిని తొలగించేందుకు ఏమైనా చర్యలు చేపట్టారా?

డిటి : రీసర్వేపై అనేక అపోహలు ఉండడం వాస్తవమే. కానీ రీసర్వే వల్ల అనేక ఉపయోగాలు ఉన్నాయి. సుమారు వందేళ్ల క్రితం బ్రిటిష్ కాలంలో సర్వే జరిగింది. అప్పటినుంచి ఇప్పటివరకు ఎటువంటి సర్వే జరగలేదు. ఈ నేపథ్యంలో భూమి అనేక రకాలుగా మార్పు జరిగింది. అయితే భూ రికార్డులు పక్కాగా ఉండాలనే ముఖ్య ఉద్దేశంతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రీసర్వేని చేపట్టింది. అపోహలు తొలగించేందుకు అన్ని విధాల చర్యలు చేపట్టాం. రైతులకు అవగాహన కల్పిస్తున్నాం.

భౌతిక శాస్త్రం పరీక్ష ప్రశాంతం

ప్రజాశక్తి - పెనుమంట్ర

మండలంలోని టెన్త్ పరీక్షలు జరుగుతున్న నాలుగు సెంటర్స్‌లో బుధవారం పిఎస్ పరీక్షకు 518 మందికి 509 మంది హాజరుకాగా, 9 మంది గైర్హాజరయ్యారని ఎంఇఒ-2 ఉంగరాల నాగేశ్వరరావు తెలిపారు. పొలమూరు జెడ్‌పి హై స్కూల్‌లో 82కు 79 మంది, మార్టేరు ఎస్‌విజి జెడ్‌పి హై స్కూల్‌లో 199 మందికి 195 మంది, మార్టేరు బిడి గరల్స్ జెడ్‌పి హై స్కూల్‌లో 68 మందికి 67 మంది, పెనుమంట్ర ఆర్‌ఎ జెడ్‌పి హై స్కూల్‌లో 169 మందికి 168 మంది హాజరయ్యారని, పరీక్షలు ప్రశాంతగా జరిగినట్లు ఆయన తెలిపారు.

మొగల్తూరు : మండలంలోని గ్రామాలలో ఐదు పరీక్ష కేంద్రాల్లో ఫిజికల్ సైన్స్ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. 814 మంది విద్యార్థులకు 797 మంది విద్యార్థులు హాజరయ్యారని ఎంఇఒ యు.శామ్యూల్ జాన్ తెలిపారు. మొగల్తూరులో 3, కేపీపాలెం 3, ముత్యాలపల్లి 6, శేరేపాలెం 2, జగన్నాథపురం 3 మొత్తం 17 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాలేదని ఆయన తెలిపారు. ఫస్ట్ టైం ఫెయిలైన 15 మంది విద్యార్థులకు నలుగురు విద్యార్థులు పరీక్షకు గైర్హాజరయ్యారన్నారు. కేపీపాలెంలోని 1, మొగల్తూరులో 3 విద్యార్థులు పరీక్షకు హాజరు కాలేదని ఆయన తెలిపారు.

నరసాపురం : భౌతిక శాస్త్రం పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని ఎంఇఒ పి.పుష్పరాజ్యం తెలిపారు. భౌతిక శాస్త్రం పరీక్షకు పట్టణం, మండలంలోని ఎనిమిది పరీక్షా కేంద్రాల్లో రెగ్యులర్, ప్రయివేట్ విద్యార్థులకు 1751 మందికి గాను 1711 మంది హాజరయ్యారన్నారు. మొత్తం 40 మంది గైర్హాజరయ్యారని తెలిపారు.

నేడు పెదఅమిరంలో ఫైబ్రో స్కాన్ సేవలు

ప్రజాశక్తి - పెనుమంట్ర

భీమవరం సమీపంలోని పెద అమిరం వద్ద ఉన్న మిత్ర మెడికేర్ హాస్పిటల్ లివర్ వ్యాధిగ్రస్తుల కోసం ఈనెల 27 గురువారం ఆసుపత్రిలో ప్రత్యేక అవకాశం కల్పించిందని సామాజిక కార్యకర్త కందుల రమేష్ యాదవ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మీ ఆరోగ్యం మా ప్రాధాన్యత అనే కార్యక్రమంగా ఫైబ్రోస్కాన్ ద్వారా కాలేయం(లివర్) సంబంధిత సమస్యలను త్వరితంగా, నిర్దిష్టంగా నిర్ధారించుకొనే అవకాశం కల్పిందని ఆయన అన్నారు. ఈ స్కాన్ ద్వారా లివర్ ఫైబ్రోసిస్, ఫ్యాటీ లివర్తో పాటు ఇతర కాలేయ సమస్యలను ముందుగానే గుర్తించడం సాధ్యం అవుతుందని ఆయన పేర్కొన్నారు. పది వేల రూపాయలు విలువ చేసే ఈ పరీక్షలు చేసే సేవలు కేవలం ఐదు వందల రూపాయలకే పొందవచ్చని, అందరూ వినియోగించుకోవాలని రమేష్ యాదవ్ కోరారు. స్లాట్ బుకింగ్ కోసం 9459359999 నంబర్‌తో సంప్రదించమని ఆయన తెలిపారు.

పల్లెలకు కార్పొరేట్ వైద్యం

ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

పల్లెల్లో కార్పొరేట్ స్థాయిలో వైద్యం అందించే దిశగా మెడికల్ క్యాంపులు నిర్వహించడం అభినందనీయమని తాడేపల్లిగూడెం ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ అభినందించారు. మండలంలోని మోదుగుంటలో బుధవారం మాజీ సర్పంచి ఏపూరి సత్యనారాయణ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మెడికల్ క్యాంపు ఆయన ప్రారంభించారు. ఏలూరు గుడ్ సమరటిన్ మల్టీస్పెషలిటీ హాస్పిటల్, అగర్వాల్ కంటి ఆధ్వర్యంలో గుండె పరీక్షలు, కంటి వైద్యపరీక్షలు, జనరల్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా 150 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వీరిలో 15 మందిని మెరుగైన పరీక్షల నిమిత్తం ఏలూరు ఆసుపత్రికి రిఫర్ చేశారు. ఈ కార్యక్రమంలో తాడేపల్లిగూడెం టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి వలవల బాబ్జి, మాజీ సర్పంచి ఏపూరి సత్యనారాయణ, కూటమి నాయకులు సిద్ధ వీర్రాజు, కట్ట జానకి, కర్నాటి పోలిరెడ్డి, గొల్లపల్లి కొండలరావు, దండు బోయిన వెంకటరమణ పాల్గొన్నారు.

వంద రోజులూ ఉపాధి పనులు చూపాలి : ఎపిఒ

ప్రజాశక్తి - గణపవరం

మండలంలో ఉపాధి హామీ కార్మికులకు వందరోజులు పని కల్పించాలని ఎపిఒ సుజాత అధికారులకు సూచించారు. బుధవారం స్థానిక మండలపరిషత్ భవనంలో ఉపాధి హామీ పనులపై జరిగిన అవగాహనా సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఏప్రిల్, మే, జూన్ నెలలో ఉపాధి హామీ కార్మికులకు పనులు కల్పించటంపై అధికారులకు అవగాహన కల్పించారు. మూడునెలల పాటు పనులు కల్పించి, పని ప్రాంతాల్లో కార్మికులకు మజ్జిగ, మంచినీరు, టెంట్లు ఏర్పాటు చేయాలని చెప్పారు. ఈ సమావేశంలో గణపవరం ఎంపిడిఒ ఆర్.బేబి శ్రీలక్ష్మి, ఉపాధి హామీ టెక్నికల్ అసిస్టెంట్ సురేంద్ర, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

న్యాయమండలి సభ్యుల నియామకానికి దరఖాస్తుల స్వీకరణ

విజయవాడ ప్రాంతీయ పర్యవేక్షణ తనిఖీ అధికారి వెంకటపతి రాజు

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలో రక్షణ, ఆదరణ కరువైన పిల్లలు, నేరారోపణ ఎదుర్కొంటున్న పిల్లల కేసులను పరిష్కరించేందుకు జిల్లా బాలల సంక్షేమ సమితి, బాలల న్యాయమండలిలో సభ్యులను నియమించేందుకు అర్హత గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు విజయవాడ ప్రాంతీయ పర్యవేక్షణ తనిఖీ అధికారి సిహెచ్.వెంకటపతిరాజు ఒక ప్రకటనలో కోరారు. నోటిఫికేషన్ వివరాలను %https://wdcw.ap.gov.in% వెబ్ సైట్‌లో పొందుపరచడం జరిగిందన్నారు. విద్యార్హతలు, తదితర వివరాలను, దరఖాస్తు ఫారంను వెబ్‌సైట్ నుంచి పొందవచ్చునన్నారు. ఆసక్తిగల, అర్హత గల అభ్యర్థులు ఏప్రిల్ 9వ తేదీలోగా డైరెక్టర్, బాలల సంక్షేమం, సంస్కరణల సేవలు, వీధి బాలల సంక్షేమ శాఖ, విజయవాడకు దరఖాస్తులను పంపించాలన్నారు. మరింత సమాచారం కోసం విజయవాడ ప్రాంతీయ పర్యవేక్షణ తనిఖీ అధికారి సిహెచ్.వెంకటపతిరాజు సెల్ నెంబర్ 91000-45417కు ఫోన్ చేసి సంప్రదించాలని కోరారు.

వైద్యులు నరసింహరాజుకు డాక్టరేట్

డాక్టరేట్ అందుకుంటున్న నరసింహరాజు

నరసాపురం : పట్టణానికి చెందిన ప్రముఖ ఫిజియోథెరపీ, ఆక్యుపంక్చర్ వైద్యులు తిరుమాని నరసింహరాజు గౌరవ డాక్టరేట్ అందుకున్నారు. ఈరంగంలో ఆయన చేసిన సేవలకు గుర్తింపుగా ఈ గౌరవం దక్కింది. పాండిచ్చేరి ఇంటర్నేషనల్ పీస్ యూనివర్సిటీ(గ్లోబల్ అక్రిడేషన్ కౌన్సిల్ జర్మనీ గుర్తింపు పొందిన) గౌరవ డాక్టరేట్ అందించింది. ఆ విశ్వవిద్యాలయం స్నాతకోత్సవం సందర్భంగా ఈనెల 23న షెన్బాగ్ కన్వెన్షన్ హాల్(పాండిచ్చేరి)లో జరిగిన కార్యక్రమంలో నరసింహరాజు డాక్టరేట్ అందుకున్నారు. జార్జ్ ప్రిన్స్ పీటర్(గ్లోబల్ ఎక్రిడేషన్ కౌన్సిల్ మెంబర్ జర్మనీ) ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. డాక్టర్ ఎమ్ కాదిర్వెల్(నేషనల్ రైట్స్ ఆర్గనైజేషన్ అధ్యక్షులు), కిమ్(చీఫ్ ఆర్గనైజర్) ఎ.గోపికన్నాన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ నరసింహరాజు మాట్లాడుతూ ఈ గౌరవం తనకు మరింత బాధ్యత పెంచిందన్నారు. చాలా సంతోషంగా ఉందని చెప్పారు. ఇంతవరకు 30 ఉచిత వైద్యశిబిరాలు నిర్వహించామన్నారు. త్వరలో మరిన్ని ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మల సీతారామన్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు ఎమ్ఎ.షరీఫ్, ప్రభుత్వ విప్, నరసాపురం ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్, ఛైర్‌పర్సన్ వెంకటరమణ, టిడిపి రాష్ట్ర నాయకులు కొవ్వలి యతిరాజ రామ్మోహన్ నాయుడు, నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు, రాష్ట్ర కాపు కార్పొరేషన్ ఛైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు, మాజీ ఎంఎల్ఎలు జానకీరామ్, ముదునూరి ప్రసాదరాజు, బండారు మాధవనాయుడు నరసింహరాజును అభినందించారు.

నవోదయకు ఇద్దరు విద్యార్థుల ఎంపిక

వెంకట రిషి శ్లోక్, పూర్ణ ఈశ్వర్ కుమార్

పాలకొల్లు రూరల్ : మండలంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, పెదగరువులో 5వ తరగతి చదువుతున్న మంతెన వెంకట రిషి శ్లోక్ నవోదయ ప్రవేశ పరీక్ష రాశాడు. పరీక్షా ఫలితాలు మంగళవారం విడుదల అయ్యాయి. ఈ నవోదయ ఫలితాలలో మంతెన వెంకట రిషి శ్లోక్ మంచి మార్కులు సాధించి గ్రామస్తుల మన్ననలను అందుకున్నాడు. జనవరిలో జరిగిన జవహర్ నవోదయ విద్యాలయ సెలక్షన్ టెస్ట్ రాసి ఆరవ తరగతిలో చేరుతున్న విద్యార్థికి పాలకొల్లు మండల విద్యాశాఖాధికారులు జి.వీరాస్వామి, ఆర్ఎన్‌విజి.శర్మ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు నిల్లా సురేష్ బాబు, సహాధ్యాయులు పంపన లక్ష్మీనారాయణ, పాఠశాల ఎస్ఎంసి ఛైర్మన్ కోటి విజయలక్ష్మి, వైస్ ఛైర్మన్ పసుపులేటి ధనలక్ష్మి, గ్రామస్తులు అభినందనలు తెలియజేశారు. **నరసాపురం :** మండలంలోని లిఖితపూడి ఎంపిపి స్కూల్ 5వ తరగతి విద్యార్థి సుంకర పూర్ణ ఈశ్వర్ కుమార్ జవహర్ నవోదయ ప్రవేశ పరీక్ష ఫలితాల్లో అర్హత సాధించినట్లు హెచ్ఎం ఎస్.మేరి తెలిపారు. పూర్ణ ఈశ్వర్ తండ్రి వెంకట పాపారావు అంబులెన్స్ డ్రైవర్, తల్లి వరలక్ష్మి గృహిణి. ఈ సందర్భంగా అర్హత సాధించిన ఈశ్వర్‌ను ఎంఇఒ పి.పుష్పరాజ్యం, ఉపాధ్యాయులు ఎం.ఆలీస్ మేరీ, కె.శాంతి అభినందించారు.

ఉండి : నవోదయకు ఉండి ఇండియన్ డిజిటల్ విద్యార్థి ఎంపికైనట్లు స్కూల్ యాజమాన్యం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంగళవారం విడుదలైన ఫలితాలలో 5వ తరగతి చదువుతున్న రామగాని నవదీప్ నవోదయలో అర్హత సాధించడంతో యాజమాన్యం ఆ విద్యార్థిని సత్కరించారు.

డాక్టర్ మాధవరావుకు పిహెచ్‌డి ప్రధానం


మాధవరావును సత్కరిస్తున్న వైస్ ప్రెసిడెంట్ ఎస్‌వి.రంగరాజు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

భీమవరం ఎస్ఆర్‌కెఆర్ ఇంజనీరింగ్ కళాశాల మెకానికల్ ఇంజనీరింగ్ డిపార్ట్మెంట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ సింగూరు మాధవరావు ఆంధ్ర యూనివర్సిటీ నుంచి మెకానికల్ ఇంజనీరింగ్‌లో పిహెచ్‌డి పొందారని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కెవి.మురళీకృష్ణంరాజు తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల యాజమాన్యం తరుపున వైస్ ప్రెసిడెంట్ ఎస్‌వి.రంగరాజు డాక్టర్ మాధవరావును ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మాధవరావు మాట్లాడుతూ ఆంధ్ర యూనివర్సిటీ మెకానికల్ ఇంజనీరింగ్ హెడ్ డాక్టర్ వివిఎస్ కేశవరావు పర్యవేక్షణలో తాను 'ఎక్స్‌పరిమెంటల్ ఇన్వెస్టిగేషన్ ఆన్ మెకానికల్ అండ్ మెషనబులిటీ బిహేవియర్ ఆఫ్ అల్యూమినియం హైబ్రిడ్ మెటల్ మెట్రిక్స్ కాంపోజిట్' అనే అంశంపై తాను చేసిన పరిశోధనకు యూనివర్సిటీ పిహెచ్‌డి ప్రధానం చేసిందన్నారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.జగపతి రాజు, మెకానికల్ ఇంజనీరింగ్ హెడ్ డాక్టర్ కె.సురేష్ బాబు మాట్లాడుతూ మెకానికల్ ఇంజనీరింగ్‌లో వస్తున్న పరిశోధనలు యంత్రాలు మరింత సమర్థవంతంగా పనిచేయటానికి, వాటి జీవన ప్రమాణం పెంచడానికి ఎంతగానో దోహదపడతాయన్నారు. మంచి పరిశోధనలు చేసిన డాక్టర్ మాధవరావును అభినందించారు.

నెలలోపే రైతులకు పరిహారం అందిస్తాం

ప్రజా పరిష్కార వేదిక సదస్సులో ఎంఎల్ఎ బొలిశెట్టి

మాట్లాడుతున్న ఎంఎల్ఎ బొలిశెట్టి

తాడేపల్లిగూడెం : ఎర్రకాలవ వరదలకు నష్టపోయిన రైతులకు పంట నష్టపరిహారం నెలలోపే అందించే ఏర్పాటు చేసే విధంగా కృషిచేస్తామని తాడేపల్లిగూడెం ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ పేర్కొన్నారు. మండలంలోని ఆరుళ్ల గ్రామంలో బుధవారం ప్రజాపరిష్కార వేదిక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో నియోజకవర్గంలో కూటమి ప్రభుత్వాన్ని గెలిపించిన ప్రజలకు సేవ చేసే బాధ్యత తమపై ఉందని, అందులో భాగంగానే గ్రామాల్లో తిరిగి ప్రజా సమస్యలు తెలుసుకుని పరిష్కరించే దిశగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. గ్రామ సమగ్రాభివృద్ధి కోసం రోడ్లు, డ్రైన్లు, గ్రావెల్ రోడ్లు, కల్వర్టు కోసం అధికారులతో ప్రణాళిక రూపొందించి రూ.17 లక్షల ప్రతిపాదనలు సిద్ధం చేశామని, త్వరలోనే ఆ నిధులు తీసుకువచ్చి గ్రామాభివృద్ధికి కృషి చేస్తామన్నారు. అనంతరం కేన్సర్‌తో బాధపడుతున్న సిర్రా ప్రసాద్, చదలవాడ మహాలక్ష్మిలకు ఎంఎల్ఎ తన సొంత నిధులు రూ.10 వేలు ఆర్థిక సాయం అందించారు. సర్పంచి మాకరాజు వరలక్ష్మి, జనసేన మండల అధ్యక్షులు అడపా ప్రసాద్, మాకరాజు సతీష్ పాల్గొన్నారు.

రేపు ఉగాది కవి సమ్మేళనం

తణుకు : శ్రీసేవా విజ్ఞానకేంద్రం, తణుకు బాలోత్సవం ఆహ్వానం మేరకు ఉగాది కవి సమ్మేళనం జరుగునని అధ్యక్షులు కవిశ్రీ మోహన్‌ప్రసాద్, సమన్వయకర్త పి.దక్షిణామూర్తి బుధవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 28వ తేదీ శుక్రవారం, సాయంత్రం 4.30 నిమిషాలకు సజ్జాపురం లయన్స్ క్లబ్ హాల్, స్త్రీ సమాజం రోడ్, విక్టరీ సూపర్ బజార్ ఎదురుగా, తణుకులో ఉగాది కవి సమ్మేళనం జరుగుతుందన్నారు. శీర్షిక: భిన్నత్వంలో ఏకత్వం-ఉగాది సందేశం, శీర్షికలోని అంశంపై కవితలు వినిపించాలని కోరారు. ఈ ఉగాది సమ్మేళనంకి అందరూ ఆహ్వానితులేనని తెలిపారు.

'అభివృద్ధి పనులు అజెండాలో పెట్టాలి'

నరసాపురం: అజెండాలో ప్రజలకు ఉపయోగపడే పనులు ఏమున్నాయి అంటూ వైస్ ఛైర్మన్ కొత్తపల్లి నాని మండిపడ్డారు. బుధవారం ఛైర్‌పర్సన్ బర్రె శ్రీవెంకటరమణ అధ్యక్షతన మున్సిపల్ కౌన్సిల్ సమావేశం జరిగింది. మొత్తం 13 అంశాలతో అజెండా తయారు చేశారు. కానీ ఇందులో అభివృద్ధి పనులు ఏమి లేకపోవడంతో అసహనం వ్యక్తం చేశారు. ఈ మాత్రం కౌన్సిల్ సమావేశం ఎందుకంటు ప్రశ్నించారు. పట్టణంలో ఒక్క అంగుళం కూడా డ్రెయినేజీలు పెరగలేదు, అయినా పూడిక తొలగింపుకు రూ.40 లక్షలు అజెండాలో పెట్టడం విడ్డూరంగా ఉంది. గత రెండేళ్ల నుంచి రూ.25 లక్షలు మాత్రమే ఉండేది. ఇప్పుడు మరో రూ.20 లక్షలు ఎందుకు పెరిగిందో అర్థం కావడం లేదన్నారు. ఈఅంశాన్ని మరోసారి పరిశీలించాలన్నారు. జనసేన కౌన్సిలర్ భరత్ సురేష్ గత కౌన్సిల్లో మెప్మా సిబ్బందికి చెందిన ఒకరు మహిళలపై వేధింపులు గురిచేస్తున్నారంటూ సమావేశానికి తెలపగా దీనిపై ఏమి చర్యలు తీసుకున్నారంటూ ప్రశించారు. అధికారుల నుంచి సరైన సమాధానం రాకపోవడంతో ఛైర్‌పర్సన్ పోడియం వద్ద మెడలో నల్ల కండువా వేసుకుని బైఠాయించారు. సురేష్‌కు మద్దతుగా కౌన్సిలర్లు బొమ్మిడి సూర్యకుమారి, తోట అరుణ, కృష్ణవేణిలు నిలిచారు. ఛైర్‌పర్సన్ చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

పంటకాలువలను ఉపాధి కూలీలతో బాగు చేయించాలి

పెనుగొండ : అత్యవసర పరిస్థితుల్లో పంటకాలువలను మహాత్మాగాంధీ జాతీయ ఉపాధిహామీ చట్టంలో బాగుచేయాలని నీటిసంఘాల అధ్యక్షులు కోరారు. బుధవారం మండల ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపిపి పూతినీడి వెంకటేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించారు. పంటకాలువల్లో కర్ర నాచు పెరిగిపోవడంతో సాగు నీరు అందడం కష్ట సాధ్యంగా మారిందన్నారు. నీటి సంఘాల ఆధ్వర్యంలో కాలువల పనులు జరుగుతున్నా, అత్యవసర పరిస్థితుల్లో ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఏకరువు పెట్టారు. ఇప్పటికే వంతుల వారీ విధానంలో నీటిని అందిస్తున్నామని తెలిపారు. ఒక్కరోజులో వరి చేలల్లోకి చేరవలసిన నీరు రోజుల తరబడి వేచి చూసినా చేరడం లేదన్నారు. దీనికి కారణం కర్రనాచు పెరిగిపోవడమేనన్నారు. ఉపాధి కూలీల ద్వారా పనులు చేయిస్తే రైతులకు ఉపకారంగా ఉంటుందన్నారు. ఉన్నతాధికారులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపిలు పాలపర్తి సుబ్రహ్మణ్యం, తోలేటి శ్రీనులు, తహశీల్దార్ జి.అనితకుమారి, ఎంపిడిఒ టి.సూర్యనారాయణ మూర్తి, నీటి సంఘం ఛైర్మన్‌లు జక్కంశెట్టి సత్యనారాయణ, బొబ్బిలి శ్రీను పాల్గొన్నారు.

'2న ఇళ్ల స్థలాల సమస్యపై ధర్నాకు తరలిరావాలి'

భీమవరం : అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు కేటాయించాలని కోరుతూ సిపిఐ ఆధ్వర్యంలో వచ్చేనెల 2వ తేదీన భీమవరం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించి, అర్జీదారులతో వ్యక్తిగత దరఖాస్తులు కలెక్టర్‌కు సమర్పించనున్నట్లు సిపిఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు అన్నారు. బుధవారం పట్టణంలోని రెల్లి కాలనీ రామాలయం వద్ద ఇళ్లు లేని పేదలతో ఇంటి స్థలాలకై అర్జీలను సిపిఐ నాయకులు పూర్తి చేయించే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా భీమారావు మాట్లాడుతూ ఇళ్లు లేని నిరుపేదలకు పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్లు ఇస్తామని, ఎన్నికల్లో కూటమి నాయకులు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ప్రతీ పేద కుటుంబం ఇంటి స్థలం పొందే వరకు పోరాటం నిర్వహిస్తామన్నారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చెల్లబోయిన రంగారావు, ఎం.సీతారాం ప్రసాద్, ప్రజానాట్యమండలి నాయకులు ఛాన్ భాషా పాల్గొన్నారు.

సర్టిఫికెట్స్ పడిపోయినవి

పున్నం మనీషా ది. 20-3-2025 సం॥రం॥ తేదిన, నేను మా ఇంటి వద్ద నుండి రాత్రి గం. 7-45 ని॥లకు Bus Stand కు బయలుదేరాను. నేను నీలం రంగు కవరులో పెట్టుకున్న 10th క్లాస్, ఇంటర్, B.Sc డిగ్రీ Certificates నీలం రంగు కవరు Activa బండికి తగిలించుకుని మా ఇంటి నుండి మా నాన్నగారు నేను (పున్నం సత్యనారాయణ మూర్తి) Bus Stand కి బయలుదేరాము. మధ్యలో పెద్ద పోస్ట్ ఆఫీస్ దగ్గరకు వెళ్ళిన తరువాత చూసుకుంటే కవరు లేదు. మార్గ మధ్యలో ఎంత వెతికిన దొరకలేదు. దొరికినవారు ఈక్రింది అడ్రస్‌కు అందజేయగలరు.

Hall ticket No.
10th Class - 1810100453 - 2018
Intermediate - 2004221957 - 2020
Degree (B.Sc.com)- 20303071 - 2023

P. MANEESHA
D.No. 34-22-11/2,
Narayana College,
Back Street, Tanuku
West Godavari Dist

గ్రామపంచాయతీ కార్యాలయము, ఆచంట, ఆచంట మండలం, ప॥గో॥ జిల్లా

ఆర్.ఒ.సి. నెం.144/2024-2025 **టెండరు నోటీసు** తేది.19-3-2025

పశ్చిమ గోదావరి జిల్లా, ఆచంట మండలం, ఆచంట గ్రామపంచాయతీ నందు కాంట్రాక్ట్ పద్ధతిపై ది. 01-04-2025 నుండి 31-03-2026 వరకు వివిధ రకముల పనులు చేయుటకు మరియు వివిధ రకముల సామాగ్రి సప్లయి చేయుటకు టెండర్లు కొరబడుచున్నవి. టెండర్లు దాఖలు చేయువారు ముందుగా ఈ క్రింది షెడ్యూలు నందు చూపిన ధరావతు చెల్లించి సీల్డు టెండర్లు పంచాయితీ కార్యదర్శికి గాని, వారి అనుమతి పొందిన వారికి గాని దాఖలు చేయవచ్చును. ది. 22-03-2025వ తేదీ ఉదయం 10.00 గంటల నుండి మధ్యాహ్నం 2.00 గంటల వరకు టెండర్లు స్వీకరించబడి ది. 22-03-2025వ తేది మధ్యాహ్నం గం॥ 2-30 ని॥లకు హాజరైన టెండరుదార్ల సమక్షంలో పంచాయతీ కార్యదర్శి గారిచే సీల్డు టెండర్లు తెరవబడును. ఇతర వివరముల కొరకు ఆఫీసు పనిచేయు సమయంలో అడిగి తెలుసుకొనవచ్చును.

షెడ్యూలు

వ. నెం.	టెండర్ వివరం	వ్యక్తుల సంఖ్య	కాలపరిమితి	చెల్లించవలసిన ధరావత్తు
1.	పి.డబ్లు.ఎస్.స్కీం పంప్ ఆపరేటర్	6	01.04.2025 నుండి 31.03.2026 వరకు	100/-
2.	స్వీపర్లు & డ్రైన్ క్లీనర్	37	01.04.2025 నుండి 31.03.2026 వరకు	100/-
3.	వీధి దీపముల నిర్వహణ ఎలెక్ట్రిషియన్	2	01.04.2025 నుండి 31.03.2026 వరకు	100/-
4.	ప్రజారోగ్య సామగ్రి	-	01.04.2025 నుండి 31.03.2026 వరకు	500/-
5.	మంచినీటి సరఫరా సామగ్రి	-	01.04.2025 నుండి 31.03.2026 వరకు	500/-
6.	స్టేషనరి అండ్ బుక్స్ ఫామ్స్	-	01.04.2025 నుండి 31.03.2026 వరకు	500/-
7.	ఎలక్ట్రికల్ సామగ్రి	-	01.04.2025 నుండి 31.03.2026 వరకు	500/-
8.	రోజువారి అద్దె ట్రాక్టర్ సప్లయి చేయుట	-	01.04.2025 నుండి 31.03.2026 వరకు	500/-
9.	పారిశుద్ధ్య సిబ్బందికి దుస్తులు, కొబ్బరినూనే, సబ్బులు మరియు పాద రక్షలు	45	01.04.2025 నుండి 31.03.2026 వరకు	500/-

సం/- **జి.వి.ఎన్.ఎల్. నరసింహరావు** పంచాయతి కార్యదర్శి
గ్రామపంచాయతి - ఆచంట,ఆచంట మండలం, ప॥గో॥జిల్లా